సాక్షి
విశాఖపట్నం
గురువారం । 9 । మార్చి । 2023



పరీక్ష కాలం..

ఈనెల 9వ తేదీన ఫార్మెటివ్, ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. 10లో



గోల్ కొట్టు.. చాన్స్ పట్టు

విశాఖ రైల్వే స్టేడియంలో బుధవారం ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభమైంది. 8లో



షిప్‌యార్డ్‌లో విశ్వ విజయ్

హిందూస్థాన్ షిప్‌యార్డుకు భారీ నౌక మరమ్మతులు చేసే ప్రాజెక్టు లభించింది. ముంబైకి చెందిన విశ్వ విజయ్ నౌక విశాఖ వచ్చింది.

న్యూస్‌రీల్

ఈత పోటీల్లో మైత్రేయికి అంతర్జాతీయ ఖ్యాతి



పతకం సాధించిన మైత్రేయి

కొమ్మాది (భీమిలి): అంతర్జాతీయ ఈత పోటీల్లో జీవీఎంసీ 8వ వార్డు ఎండాడకు చెందిన 5 ఏళ్ల బాలిక ఎన్నిటి మైత్రేయి పతకాలు సాధించింది. బ్యాంకాక్‌లో ఈ నెల 2 వ తేదీ నుంచి జరిగిన ఏషియన్ ఓపెన్ స్కూల్స్ ఇన్విటేషనల్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ –2023 పేరుతో నిర్వహించిన ఈత పోటీల్లో మైత్రేయి పాల్గొంది. 48 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. భారత దేశం నుంచి80 మంది ఎంపికయ్యారు. ఏపీ నుంచి నలుగురు ఎంపిక కాగా..అందులో మైత్రేయి ఒకరు. గ్రూప్–8 విభాగంలో పోటీ పడిన మైత్రేయి ఏడు రజిత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించింది. ఆల్ రౌండ్ విభాగంలో ఆసియాలో ద్వితీయ స్థానంలో నిలిచించి. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనపరిచిన బాలిక తండ్రి ఐఆర్‌ఎస్ అధికారి భాస్కరరావు, తల్లి మంగమ్మ జిల్లా అటవీ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్నారు.

11 నుంచి 13 వరకు మద్యం దుకాణాల బంద్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలు ఈ నెల 13వ తేదీన జరగనున్న దృష్ట్యా జిల్లాలో మూడు రోజుల పాటు అన్ని రకాల మద్యం దుకాణాలు మూసివేయడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు(స్టార్ హోటళ్లలో సైతం), టూరిజం బార్స్, నేవల్ క్యాంటీన్స్, కల్లు దుకాణాలు, మద్యం డిపోలు కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఓట్ల లెక్కింపు జరిగే 16వ తేదీన కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాలు తెరవడం జరగదన్నారు.

ఆనందపురం ఎంఈవో సస్పెన్షన్

ఆనందపురం (భీమిలి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని ఆనందపురం మండల విద్యాధికారి ఎస్ఎస్ పద్మావతిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సస్పెండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అనుసరించి తమ విధులను నిర్వహించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున హెచ్చరించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): సికింద్రాబాద్ డివిజన్, గంగినేని, ఎర్రుపాలెం స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో దారిమళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డిసిఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖలో ఈ నెల 9,11,13,15,16 తేదీలలో బయల్దేరే విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ వయా గుంటూరు, పగిడిపల్లి మీదుగా ప్రయాణిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మార్గంలో గుంటూరు స్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ కల్పించారు. ఈ నెల 15న బయల్దేరే షాలిమర్-సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి స్టేషన్‌ల మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, గుంటూరు స్టేషన్‌లలో హాల్ట్ కల్పించారు. ఈ నెల 12న యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ వయా పగిడిపల్లి, గుంటూరు మీదుగా నడుస్తుంది. ఈ మార్గంలో గుంటూరు స్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ కల్పించారు.

ఫెన్సింగ్ క్రీడ జిల్లా టీమ్ ఎంపిక నేడు

మధురవాడ (భీమిలి): మధురవాడలో నిర్వహించాల్సి జిల్లా ఫెన్సింగ్ బాల్ టీమ్ సెలక్షన్స్ అనివార్య కారణాలు వలన గురువారానికి మార్చినట్టు అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. విశాఖ జిల్లా నుంచి పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూలులో గురువారం మధ్యాహ్నం 1గంట నుంచి ప్రారంభమవుతాయని క్రీడాకారులు, కోచ్‌లు, పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని కోరారు. మరిన్ని వివరాలకు 96405 22141, 91827 16430 నంబర్లలో సంప్రదించాలన్నారు.



...మహిళా ఉద్యోగులు

● ఆనందాల వేళ..

నీ కాటుక కనులు విప్పారకపోతే ఈ భూమికి తెలవారదుగా...
నీ గాజుల చేయి కదలాడకపోతే ఏ మనుగడ కొనసాగదుగా...
ప్రతి వరసలోను ప్రేమగా అల్లుకున్న బంధమా
అంతులేని నీ శ్రమ అంచనాలకందునా...
ఆలయాలు కోరని ఆదిశక్తి రూపమా
నీవులేని జగతిలో దీపమే వెలుగునా...

అంటూ ఓ సినీ కవి మహిళల ఔన్నత్యాన్ని గొప్పగా వర్ణించారు. అందుకు దీటుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మహిళలను గౌరవించుకున్నారు.. అభినందించారు. సత్కరించారు. 8లో



నగరంలో హోలీ సందడి

● రంగుల కళ

నగరం మోదుగుపూవయింది... **హోలీ రంగుల్లో** తడిసి ముద్దయింది. కలర్‌ఫుల్ **ఈవెంట్‌కు వేదికైంది.** బుధవారం విశాఖ సప్తవర్ణా**లతో కళకళలాడింది.** చిన్నాపెద్దా తేడా లేకుండా **రంగులు పూసుకుని** సిటిజనులు ఆనందంగా హో**లీ జరుపుకొన్నారు.** 8లో

విశాఖకు విద్యుత్ బస్సులు

- 100 వరకు వచ్చే అవకాశం
- ఆరు నెలల్లో నగర రోడ్లపై పరుగులు
- సిటీ బస్సులుగా నడపనున్న అధికారులు
- తొలుత సింహాచలం, గాజువాక/వాల్తేరు డిపోలు ఎంపిక
- కొత్తగా మరో 100 డీజిల్ బస్సులు



విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ నగరంలోకి విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆరు నెలల్లో ఇవి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ప్రజా రవాణా విభాగం (పూర్వ ఏపీఎస్ ఆర్టీసీ) రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎలక్ట్రిక్ (విద్యుత్) బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా విశాఖ నగరానికి వంద విద్యుత్ బస్సులు కేటాయించే అవకాశం ఉంది. త్వరలో కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖకు వంద ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని ప్రజా రవాణా విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ-బస్సులకు లైన్ క్లియర్ కావడంతో తొలివిడతలో 50, మలి దశలో మరో 50 వెరసి వంద బస్సులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విద్యుత్ బస్సులు ఎయిర్ కండిషన్ సదుపాయాన్ని కలిగి ఉంటాయి. బ్యాటరీ సాయంతో నడవనున్నందున ఇవి దూర ప్రాంతాలకు అనువుగా ఉండవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని నగరంలో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు సిటీ సర్వీసులుగానే నడుపుతారు.

రెండు డిపోలు ఎంపిక..

విశాఖలోని రెండు డిపోల్లో వీటిని ప్రవేశపెట్టాలని ఆర్టీసీ అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికొచ్చారు. ఇందుకోసం సింహాచలం డిపోను ఇప్పటికే ఖరారు చేయగా, రెండో డిపోను గాజువాక లేదా వాల్తేరుల్లో ఒకదానికి ఎంపిక చేయనున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక గ్యారేజీని ఏర్పాటు చేస్తారు. సింహాచలం సింహపురి కాలనీలో ఉన్న ఆర్టీసీ స్థలంలో ఈ ఎలక్ట్రిక్ గ్యారేజీకి అనువుగా ఉంటుందని నిర్ణయించారు. విశాఖకు కనీసం వంద విద్యుత్ బస్సులు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. తొలిదశలో బస్సులు రావడానికి ఆరు నెలల సమయం పట్టవచ్చని భావిస్తున్నామన్నారు.

మరో వంద డీజిల్ బస్సులు..

విశాఖపట్నం జిల్లాకు విద్యుత్ బస్సులతో పాటు మరో వంద వరకు కొత్త డీజిల్ బస్సులు రానున్నాయి. ఆర్టీసీలో 13 లక్షల కిలోమీటర్లు తిరిగిన లేదా 15 ఏళ్లు పూర్తయిన బస్సులను తొలగిస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెడ్తారు. మరికొన్ని బస్సులను 9–10 లక్షల కిలోమీటర్లు తిరిగాక పల్లెవెలుగు సర్వీసులుగా బాడీని మార్పు చేసి నడుపుతారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న బస్సులు 35 వరకు ఉన్నాయి. త్వరలోనే వాటిని నిలిపివేయనున్నారు. 2024 సంవత్సరంలో మరికొన్ని బస్సులకు కాలం చెల్లనుంది. ఈ నేపథ్యంలో పాత బస్సుల స్థానంలో కొత్తవి, డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన సర్వీసులు వెరసి మరో వంద వరకు డీజిల్ బస్సులు కేటాయించే వీలుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం హర్షణీయం



కల్పలతారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చొక్కాకుల తదితరులు

విశాఖ విద్య: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవడం హర్షణీయమని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. బుధవారం విశాఖ వచ్చిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని కలసి అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ ఎంతో చొరవ తీసుకొని సానుకూలత వ్యక్తం చేయడం శుభ పరిణామమన్నారు. పెన్షనర్స్ మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈహెచ్ఎస్, ఏపీజీఎల్, టీఏ బిల్స్, జీపీఎఫ్ లోన్లు, సరెండర్ లీవ్స్ చెల్లింపుకు దశల వారీగా నిధులు విడుదల చేసేందుకు అంగీకరించటం వల్ల ఎంతో కాలంగా వీటి కోసమని ఎదురుచూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయకు మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షానే ఉందని మరో మారు రుజువైందన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ అసోసియేషన్ నాయకులు గోవింద్, సురేష్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపునకు సమష్టి కృషి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు
- బీసీ సంఘాల ప్రతినిధులతో భేటీ



బీసీ సంఘాల నాయకులతో ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం బీసీ సంఘాలు సమష్టి కృషి చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఉత్తరాంధ్ర బీసీ సంఘాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలను సామాజిక న్యాయం దిశగా నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీలకు రాష్ట్రంలో సముచిత స్థానం కల్పిస్తున్న ఆయనకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానాన్ని గెలిపించి కానుకగా ఇవ్వాలని కోరారు. విశాఖలో రాజధాని ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర బీసీల అభ్యున్నతి మరింత వేగం పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలన్నారు. ఈ దిశగా బీసీ సంఘాలను సమన్వయపరుస్తూ చైతన్యం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్‌కు ఆర్.కృష్ణయ్య సూచించారు.

సీఎం జగన్‌కు అండగా బీసీలు

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ మాట్లాడుతూ బీసీలందరికీ అండగా నిలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎన్నికల్లో బీసీలంతా మద్దతుగా నిలవాలన్నారు. వెనుకబడిన వర్గాల పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడంతోపాటు విద్యా వ్యవస్థ నవీనీకరణకు కృషి చేస్తున్న సీఎంకు అన్ని విధాలా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఒక పక్క సంక్షేమ పథకాల ద్వారా పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. మరో పక్క వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వం ఉన్నప్పటికీ రాష్ట్రంలో నిరుద్యోగులకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, కొటన రాము, వేణు మాధవ్, కార్పొరేటర్ నారాయణ, నీలం వెంకటేష్, అనంతకుమార్, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి తదితరులు

- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం
- హాజరైన మేయర్ హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: మహిళా సాధికారత, స్వావలంబనే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. బుధవారం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు అద్దాల కృపాజ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలను జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారంతా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు.

మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న తపనతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలలో అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం మహిళలు సామాజికంగా..ఆర్థికంగా ముందుకు వెళుతున్నారన్నారు. మహిళలకు రాజకీయంగా కూడా సీఎం జగన్ సముచిత గుర్తింపు ఇచ్చారన్నారు.

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళా రిజర్వేషన్ కంటే అత్యధికంగానే వైఎస్సార్‌సీపీలో మహిళలకు చట్టసభల్లో అవకాశం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన. వసతి దీవెన, జగనన్న చేయూత, జగనన్న చేదోడు లాంటి సంక్షేమ పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా ఎంచుకున్నారని గుర్తు చేశారు. దిశ చట్టం ద్వారా మహిళలకు భరోసా కల్పించారన్నారు.

పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అద్దాల కృపాజ్యోతి మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని అలాంటి మాతృమూర్తులకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు మంత్రివర్గంలో కీలక శాఖలు మహిళలకు కేటాయించడం అభినందనీయమని కొనియాడారు

ఈ కార్యక్రమంలో విశాఖ జోనల్ మహిళ రీజినల్ కో ఆర్డినేటర్ గరికిన గౌరి, శ్రీకాకుళం జోనల్ రీజనల్ కో ఆర్డినేటర్ పద్మావతి, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు పిల్లా సుజాత, పల్లా చిన్నతల్లి, కొండా రమాదేవి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఉత్తరాంధ్ర రీజియన్ చైర్‌పర్సన్ మాధవి వర్మ, ముఖ్యమహిళా నేతలు పీలా వెంకటలక్ష్మి, రోజారాణి, పేడాడ రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు



దొండపర్తి (విశాఖ దక్షిణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు కర్నూలు జిల్లా నుంచి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇక్కడి నుంచి శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు పంపించినట్లు వెల్లడించారు. విశాఖ జిల్లాకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో వెరిఫికేషన్ చేస్తామన్నారు.

సుశీల, ఉషా ఉతుప్‌లకు మోస్ట్ ఇన్‌స్పైరింగ్ ఉమన్ అవార్డు



తమ గాత్రంతో దేశ ప్రజలను ఉర్రూతలూగించిన పి.సుశీల, ఉషా ఉతుప్‌ల రాకతో విశాఖ పులకించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేళ బుధవారం రాత్రి యాక్మి స్వచ్ఛంద సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 10లో

క్లుప్తంగా

రిప్ కరెంట్‌పై అవగాహన


హెచ్చరికలు జారీ చేస్తున్న గార్డులు

బీచ్‌రోడ్డు: హోలీ పండగ కావడంతో విశాఖ సాగరతీరానికి బుధవారం అధిక సంఖ్యలో యువతీ యువకులు తరలివచ్చి సందడి చేశారు. అనంతరంలో సముద్రంలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రిప్ కరెంట్‌పై బీచ్ పెట్రోలింగ్ వాహనం ద్వారా బీచ్‌గార్డులు అవగాహన కల్పించారు. ఆర్.కె. బీచ్, రుషికొండ బీచ్‌లో రెండు వాహనాలతో పెట్రోలింగ్ చేశారు. సాంకేతికత ద్వారా సముద్రంలో అనూహ్య మార్పులను గమనిస్తూ సందర్శకులకు హెచ్చరికలు జారీ చేశారు.

వీడియో జర్నలిస్ట్ చిన్నా మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, గంట్ల శ్రీనుబాబు తదితరులు

కంచరపాలెం: సీనియర్ వీడియో జర్నలిస్ట్ బి.చిన్నా(37) మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. అల్పాహారం తీసుకున్న సమయంలో ఊపిరి అందకపోవడంతో స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఊర్వశి కూడలి బర్మాక్యాంప్ శ్మశాన వాటికలో బుధవారం అతని భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు కంచరపాలెంలోని ఆయన నివాసం వద్ద చిన్నా పార్థివదేహాన్ని పలువురు సందర్శించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చిన్నా కుటుంబానికి రూ.15 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ధర్మాల ఆనంద్‌కుమార్ రెడ్డి, పలువురు పాత్రికేయులు చిన్నా మృతదేహానికి నివాళులర్పించారు.

వనితా.. నీదే ఈ ఘనత


మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ సతీమణి నిహారిక మల్లికార్జున

డాబాగార్డెన్స్: అన్ని రంగాల్లో మహిళలు ముందున్నారని, వారు నిజ జీవితంలో పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మహిళా ఉద్యోగులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అటు కుటుంబ పోషణ, అటు ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మగవారికి తీసి పోని విధంగా మహిళలు బాధ్యతలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ సతీమణి నిహారిక మల్లికార్జున, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, పర్యవేక్షణాధికారి హెన్నా తదితరులు వారి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ సతీమణి బహుమతులు అందించారు. మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు.


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ.. బీచ్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న నేవీ, పోలీస్ ఉన్నతాధికారులు



డాక్టరమ్మకు సత్కారం

ప్రముఖ వైద్యురాలు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతికి రాష్ట్ర అవార్డును ప్రదానం చేస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది.
- బీచ్‌రోడ్డు

పోర్టు అభివృద్ధిలో భాగస్వాములు కండి

పోర్టు ఛైర్మన్ రామ్మోహనరావు


మాట్లాడుతున్న ఛైర్మన్ రామ్మోహనరావు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం సాలగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథి పోర్టు ఛైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ పోర్టు అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరం కష్టపడి పనిచేసి పోర్టు ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేద్దామన్నారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ మహిళా ఉద్యోగినులను ఛైర్మన్ ఘనంగా సత్కరించారు. పోర్టులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పోర్టు మహిళా ఉద్యోగినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్లు అయ్యంగారి సీతారత్నం, శైలజ, పోర్టు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్ స్వామి, అధిక సంఖ్యలో మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించండి

మహిళలకు సీపీ శ్రీకాంత్ సూచన


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని విశాఖ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో రోడ్‌సేఫ్టీపై మహిళలకు అవగాహన ర్యాలీ జరిగింది. పోలీస్, నేవీ ఉన్నత మహిళాధికారులు బుధవారం బీచ్‌రోడ్డులోని ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చాలా వరకు హెల్మెట్ ధరించకపోవడం వలనే జరుగుతున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ చేసే క్రమంలో మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి గైక్వాడ్, కల్యాణి ఆస్పత్రి నర్సింగ్ అధికారిణి కమాండర్ సౌజన్య, మేజర్ లిధ్య శ్రీర్, పలువురు నేవీ, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టవర్ సీ అపార్ట్‌మెంట్‌లో..


వేడుకల్లో పాల్గొన్న మహిళామణులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ఏఎంజీ ఆస్పత్రి వెనుక గల టవర్ సీ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు స్త్రీ ఔన్నత్యంపై ప్రసంగించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు.. వాటిని ఎదుర్కొనే చర్యలపై చర్చించారు. అనంతరం మహిళలంతా ఆట, పాటలతో సందడి చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

మహిళా ప్రగతికి ఏయూ నిదర్శనం


రెక్టార్ సమతను సత్కరిస్తున్న ఏయూ ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మహిళా ప్రగతికి నిదర్శనంగా ఏయూ నిలుస్తుందన్నారు. ఏయూ అసెంబ్లీ మందిరంలో తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో పదవులను మహిళలకు కేటాయిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహిళాభ్యున్నతికి విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞతో మహిళలు కుటుంబాన్ని, వృత్తిపరమైన బాధ్యతలను సమన్వయంతో సమర్థంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన 56 మంది మహిళలను విశిష్ట మహిళా మణి పురస్కారం–2023తో వీసీ సత్కరించారు. డాక్టర్ దుర్గాభాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా పి.ఉష రచించిన 'సేఫ్టీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ యంగ్ వుమెన్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ ద ఆంధ్రప్రదేశ్' పుస్తకం, తెలుగు పరిశోధక విద్యార్థి దేవరకొండ ప్రవీణ్ కుమార్ రచించిన ఆంధ్రలో అజ్ఞాత స్వాతంత్ర్య వీరులు– వీర వనితలు గ్రంథం, ఒమ్నీ ఆర్.కె. ఆస్పత్రి వారు రాయితీ కల్పిస్తూ ఏర్పాటు చేసిన గిఫ్ట్ కూపన్లను వీసీ ఆవిష్కరించారు. రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, పలు విభాగాల ప్రిన్సిపాళ్లు వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఎస్.కె.భట్టి, పాలక మండలి సభ్యుడు కృష్ణమంజిరి, కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

డీసీపీ సుమిత్ సునీల్ గరుడ్


మహిళా పోలీసులకు ఐ డ్రాప్స్, కళ్ల జోళ్లు అందజేస్తున్న డీసీపీ సుమిత్


మహిళా పోలీసులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: ఇంటా, బయటా పని ఒత్తిడితో బాధ్యతలు నిర్వర్తించే మహిళలు తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ సుమిత్ సునీల్ గరుడ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో మహిళా పోలీసులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలకు కళ్లు పొడిబారుతాయని..వంశపారపర్యంగా కొన్ని రకాల కంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. పోలీస్ కుటుంబ సభ్యుల కోసం తరచూ కంటి పరీక్షలు నిర్వహిస్తామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర మాట్లాడుతూ కళ్లు పొడిబారడం వల్ల కంటి చూపు తగ్గిపోతుందన్నారు. ఏడాదికి ఒకసారి కంటి పరీక్ష చేయించుకుంటే మంచిదన్నారు. మంచి నీరు ఎక్కువగా తాగాలన్నారు. శిబిరంలో 100 మంది మహిళా పోలీసులు కంటి వైద్య పరీక్షలు చేసి.. అవసరమైన వారికి డీసీపీ చేతుల మీదుగా ఐ డ్రాప్స్, కళ్లజోళ్లు అందించారు. అడిషనల్ డీసీపీ సుబ్రహ్మణ్యం, పలువురు పోలీస్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మేడపై నుంచి దూకి వివాహిత ఆత్మహత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


భర్త, కుమారుడితో కనకస్వాతి(ఫైల్)

మల్కాపురం: వారిద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో నిండు నూరేళ్లు కలిసి ఉంటామని ప్రమాణం చేసుకున్నారు. ఎలాంటి అపార్థాలకు తమ మధ్య చోటు లేదనుకున్నారు. కానీ.. ఆమె జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. వివాహం జరిగి పదేళ్లు కూడా కాకుండానే భర్త, బిడ్డను విడిచి తనువు చాలించింది. భర్త మంచి కోసం చెబితే అర్థం చేసుకోకుండా.. తనపై దాడికి పాల్పడ్డాడని మనస్తాపం చెంది మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. మహిళా దినోత్సవం రోజున ఈ ఘటన జరగడం అందరినీ కలచివేసింది. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 59వ వార్డు శ్రీహరిపురం సమీపంలోని ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ ప్రాంతంలో ఎస్.సుధాకర్‌రెడ్డి, అతని భార్య ఎస్.కనకస్వాతి(31) జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఎనిమిదేళ్ల కిందట వీరు ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా.. వీరి ఇంటి ఎదురుగా ఉన్న వారి పెళ్లి రోజు వేడుకలు మంగళవారం జరిగాయి. వారు ఇచ్చిన పార్టీలో సుధాకర్‌రెడ్డి మద్యం సేవించి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. దీంతో ఆమె భర్తను ప్రశ్నించింది. దీనిపై ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో అండమాన్‌లో ఉంటున్న అత్తకు ఫోన్ చేసి భర్త తీరును వివరించింది. దీనిపై ఆగ్రహించిన సుధాకర్ భార్యతో వాదనకు దిగాడు. ఈ క్రమంలో ఆమెను కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తను ఉంటున్న భవనం మూడో అంతస్తు నుంచి బుధవారం ఉదయం 9 గంటల సమయంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. తల్లి మరణించడంతో కుమారుడు గొంతు మూగబోయేలా రోదించాడు. వీరిది ప్రేమ వివాహం అయినా కొంతకాలంగా పలు కారణాలతో గొడవలు పడుతున్నారని పోలీసులు వెల్లడించారు. సమాచారం అందుకున్న ఏసీపీ శిరీష, సీఐ లూథర్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సుధాకర్‌ను విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

● రంగుల హోలీ.. ఆనందాల కేళి



బీచ్‌రోడ్డు: హోలీ సందర్భంగా బుధవారం సాగరనగరి రంగులమయమైంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వీఎంఆర్డీఏ పార్కు వరకు యువత కోలాహలంతో సందడి నెలకొంది. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు. స్టార్ హోటళ్లు, పలు ఈవెంట్ సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డ్యాన్సులు, పాటలతో సందడి చేశారు. రెయిన్ డ్యాన్స్, మట్టి డ్యాన్స్, టామాట డ్యాన్స్‌లతో కేరింతలు కొట్టారు. మూడో పట్టణ పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.







గోల్ కొట్టు.. చాన్స్ పట్టు

- సత్తా చాటితే రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించే అవకాశం
- ప్రారంభమైన అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం విశాఖ రైల్వే స్టేడియంలో ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభమైంది. ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాల క్రీడాకారిణులు పోటీపడుతున్నారు. వీరిలో కొందరు ఇప్పటికే సీనియర్ నేషనల్స్ ఆడిన వారున్నారు. కొందరు గోల్స్ సైతం చేయగా మరికొందరు ఈసారి గోల్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న ఈ టోర్నీలో సత్తా చాటితే రాష్ట్ర జట్టుకు ఆడే అవకాశం దక్కనుంది. ఈ సందర్భంగా నేషనల్ మీట్‌లో ఆడిన వారి అనుభవాలివీ..

మూడు సార్లు నేషనల్స్‌కు ఆడాను



మూడు సార్లు నేషనల్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీల్లో పాల్గొన్నాను. కేరళలోని కోజీకోడ్‌లో జరిగిన నేషనల్స్‌లో ఆడినా గోల్స్ చేయలేకపోయాను. ఈసారి నేషనల్స్‌లో కచ్చితంగా గోల్ చేస్తా.. కానిస్టేబుల్ సెలక్షన్‌కు సిద్ధమవుతున్నా.
- వరలక్ష్మి

నేషనల్స్‌లో గోల్ చేశా..



9వ తరగతి చదువుతున్నాను. 2017లో స్పోర్ట్స్ స్కూల్‌లో చేరాను. ఏడాది తర్వాత టోర్నీల్లో ఆడటం మొదలుపెట్టాను. స్ట్రయికర్‌ను. సీనియర్స్ నేషనల్స్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీలో తమిళనాడుపై ఓ గోల్ చేశాను.
- అరుణ

స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ



4వ తరగతి చదువుతుండగానే స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్లను వెళ్లాను. ఎంపికయ్యాను. తొలి ఏడాది కండీషనింగ్ ఎక్సర్‌సైజ్‌లు నేర్పి అనంతరం ఏ గేమ్‌కు సూట్ అయితే అందులో తీసుకుంటారు. నేను ఫుట్‌బాల్‌కు ఎంపికై నేషనల్స్ ఆడే స్థాయికి చేరుకున్నాను. జట్టు మిడ్‌ఫీల్డర్‌గా సుబ్రతో ట్రోఫీలో ఆడాను.
- అనురాధ

నాన్నకు ఇష్టం



నాన్న చనిపోయారు. అమ్మ చిన్న చిన్న పనులు చేసుకుంటూ పోషిస్తోంది. నాన్నకు ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. అందుకే స్కూల్ స్థాయి నుంచే ఫుట్‌బాల్ ఆడుతున్నాను. అంచెలంచెలుగా నేషనల్ మీట్ ఆడే స్థాయికి ఎదిగాను. కానీ గాయపడటం వల్ల ఆడలేక పోయాను.
- శిరీష

ఫుట్‌బాల్ టోర్నీలో సెమీస్‌కు గుంటూరు

సత్తాచాటిన విశాఖ, కడప

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ వుమెన్ ఫుట్‌బాల్ టోర్నీ సెమీస్‌కు గుంటూరు చేరుకోగా విశాఖ, కడప జిల్లాల జట్లు తొలి మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఏపీలోని ఉమ్మడి జిల్లాలు నాలుగు పూల్స్‌లో తలపడుతుండగా గుంటూరు తొలి మ్యాచ్‌లో 8-0 గోల్స్ తేడాతో శ్రీకాకుళంపై, రెండో మ్యాచ్‌లో 2-1తో కృష్ణా జిల్లా జట్టుపై విజయం సాధించింది. విశాఖ జట్టు 5-0తో పశ్చిమగోదావరి జట్టుపై, కడప 7-0తో ప్రకాశం జట్టుపై గెలుపొందాయి. నెల్లూరు 1-1తో తూర్పు గోదావరి జట్టుతో మ్యాచ్ డ్రా చేసుకుంది. నెల్లూరు మరో మ్యాచ్‌లో 1-0తో విజయనగరం జట్టుపై, కర్నూలు 5-0తో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో బుధవారం విశాఖ- పశ్చిమగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ కిక్ ఆఫ్ చేసి ప్రారంభించారు. ఇరుజట్ల క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.